క్లుప్తంగా

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న నేషనల్ హైవే అథారిటీ అధికారులు, సిబ్బంది

మంచిర్యాలటౌన్: జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు డైరెక్టర్ అజయ్ మణికుమార్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నేషనల్ హైవే కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. 30మంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయగా, బీఎస్ఎన్ఎల్ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 20మంది ఉద్యోగులు డివిజనల్ ఇంజనీర్ బి.ప్రకాష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కె.భాస్కర్ రెడ్డి, రక్తనిధి ఇన్‌చార్జి వి.మధుసూదన్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ ప్రేమ్‌సాయి, రక్తనిధి సూపర్‌వైజర్ కె. మాధవి, సీనియర్ టెక్నీషియన్ ప్రణయ్, సురేశ్, రజిత, సత్యవతి పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు

పాతమంచిర్యాల: బీఎస్ఎన్ఎల్ ఏర్పాటై 25సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజీలో బుధవారం బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించారు. ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి, కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టెలికాం డీఈ ప్రకాష్, ఎస్‌డీఈలు రవి కుమార్, సురేందర్, చంద్రమౌళి, సదానందం, వెంకట్, క్రాంతి, జూనియర్ టెలికాం అధికారులు రాజేశం, తిరుపతి, ప్రవీణ్, మహేందర్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ సభ్యత్వ నమోదు



సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ 3గనిలో ఐఎన్‌టీయూసీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం చేపట్టి కార్మికుల నుంచి సభ్యత్వం సేకరించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు గరిగే స్వామి, ఏనుగు రవీందర్ రెడ్డి, జీవన్ జోయల్, వీరమల్లు, రణదీప్, సుధాకర్, ఏరియా నాయకులు ప్రవీణ్, వేణుగోపాల్, తిరుపతి, సందీప్ పాల్గొన్నారు.

ఇక్కడే దసరా!



రావణాసురుడి ప్రతిమ ఏర్పాటు కోసం సిద్ధం చేసిన కర్రలు

బెల్లంపల్లి/చెన్నూర్: తెలుగు ప్రజలు జరుపుకునే పండుగల్లో అతిపెద్ద పండగ దసరా. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దసరాను నిర్వహించుకుంటారు. ఈ సందర్భంగా వేడుకల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా అధికారులు, ఆలయ కమిటీ, హిందూ ఉత్సవ సమితి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలోని తిలక్‌స్టేడియంలో సభావేదిక, రావణాసురుడి ఆకారంతో కూడిన బొమ్మ నిర్మాణ పనులు తుదిదశకు చేరాయి. దసరా సందర్భంగా జిల్లాలోని సొంతూళ్లకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు చేరుకున్నారు.

ఏటా ముంబై నుంచి వస్తాను...



నా జన్మస్థలం బెల్లంపల్లి. ఇక్కడే పుట్టి పెరిగాను. ప్రస్తుతం ముంబైలో ఉంటున్నాను. ఏటా ఆనవాయితీ ముంబై నుంచి వచ్చి పుట్టినూరులో బతుకమ్మ, దసరా వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషం కలుగుతోంది. అమ్మలక్కలతో సరదాగా మాట్లాడుకోవడం తృప్తినిస్తోంది. ఆప్యాయతలు, అనురాగాలు నన్ను ఆకట్టుకుంటాయి.

\- కిరణ్ మృదుల, ముంబై

ఏటా వైభవంగా..



నేను పుట్టింది పెరిగింది బెల్లంపల్లిలోనే. పెళ్లయ్యాక ఏడేళ్ల నుంచి హైదరాబాద్‌లో ఉంటున్నా. ఏటా దసరా వేడుకలను మాత్రం బెల్లంపల్లిలో జరుపుకుంటాను. ఇక్కడ నిర్వహిస్తున్న రావణాసుర వధ కార్యక్రమం ఎంతో వైభవంగా జరుగుతోంది. నాలాగానే ఎక్కడెక్కడో దూరప్రాంతాల్లో ఉంటున్న ఆడపడుచులంతా కూడా పుట్టింటికి చేరుకొని దసరా వేడుకల్లో భాగస్వాములు కావడం బెల్లంపల్లి ప్రత్యేకతగా చెప్పవచ్చు.

\- గీతిక, హైదరాబాద్

డల్లాస్ నుంచి వచ్చా..



ఉద్యోగ రిత్యా 1996లో డల్లాస్ పోయాం. 31ఏళ్లుగా దసరాతో పాటు ఇతర పండుగలు డల్లాస్‌లోనే జరుపుకున్నా. అమ్మతో ఈ ఏడాది పండుగ జరుపుకోవాలని చెన్నూర్‌కు వచ్చా. సొంతూరుకు రావడం, ఈ ఏడాది అమ్మతో పాటు దోస్తులతో దసరా పండుగ జరుపుకోవడం చాలా సంతోషంగా ఉంది.

\- కొమ్మెర రవీందర్, సాఫ్ట్‌వేర్, డల్లాస్

ప్రతీ దసరాకు వస్తాం..



నేను పుట్టింది చెన్నూర్. హైదరాబాద్‌లో స్థిరపడి సుమారు 30 ఏళ్లు అవుతుంది. కానీ ప్రతీ దసరాకు వస్తాం. సొంతూర్లో చిన్ననాటి మిత్రులు, బంధువులతో పండుగ జరుపుకోవడం ఎంతో సంతోషాన్నిస్తోంది. కులమతాలకు అతీతంగా పండుగ జరుపుకుంటాం. చెన్నూర్‌లో లభించిన ఆప్యాయత హైదరాబాద్‌లో లభించదు.

\- పులి కిశోర్, మైక్రో ఫైనాన్స్ అధినేత

ఫ్యామిలీతో వచ్చాం..



మూడేళ్లుగా పూణేలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశా. ప్రస్తుతం బదిలీపై హైదరాబాద్‌కు వచ్చాను. పూణేలో ఉన్నప్పటి నుంచి నేటి వరకు దసరా పండుగకు చెన్నూర్‌కు ఫ్యామిలీతో వస్తాం. ఉద్యోగంలో ఏడాది పాటు బిజీగా ఉన్నప్పటికీ దసరాకు స్వగ్రామం వచ్చి అందరితో కలిసి జరుపుకుంటే ఏడాది పని అలసట తీరుతుంది.

\- రాపర్తి వినయ్‌కుమార్ ఫ్యామిలీ

చెన్నూర్‌లో స్పెషల్...

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలో దసరాకు ప్రత్యేకత ఉంది. పుణ్య నదిగా పేరొందిన పంచక్రోశ ఉత్తర వాహిని సమీపంలో గల గోవరమ్మ ఆలయం వద్దనే సుమారు 200ఏళ్లకు పైగా శమీ పూజలు నిర్వహిస్తున్నారు. చెన్నూర్ ప్రాంతంలో ఆగస్త్యా మహాముని సంచరించి చెన్నూర్ శివాలయంలో శివలింగాన్ని ప్రతిష్ఠించినట్లు పురాణాలు చెబుతున్నాయి. కోటపల్లి మండలంలోని కొత్తపల్లితో పాటు జైపూర్ మండలం శివ్వారం ప్రాంతంలో పాండవ పుత్రుడు భీముని అడుగులు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతంలో పాండవ వంశస్థులు సంచరించారని పురాణాలు చెబుతున్నాయి. ఆ కాలంలో గోవరమ్మ ఆలయం వద్ద శమీ చెట్టు ఉండగా, దసరా పండుగ రోజున పట్టణ ప్రజలంతా భాజాభజంత్రీలతో అక్కడికి వెళ్లి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని ఈ ప్రాంత వాసులంటున్నారు. ప్రస్తుతం శమీ చెట్టు అంతరించి పోగా, దసరా రోజున శమీ చెట్టును తీసుకొచ్చి ఆలయం ప్రాంగణంలో నాటి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. గోదావరి నది సమీపంలో గల గోవరమ్మ ఆలయం వద్ద దసరా కోసం ఏర్పాట్లను పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు.



ఏర్పాట్లు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అనాదిగా ఒకే కుటుంబం పూజలు..

చెన్నూర్‌లో 200ఏళ్లకు పైగా నిర్వహిస్తున్న దసరా పండుగ సందర్భంగా గోవరమ్మ ఆలయం వద్ద శమీ పూజలను అనాదిగా పట్వారీ శ్రీనివాస్‌రావు కుటుంబ సభ్యులే నిర్వహిస్తున్నారు. శ్రీనివాస్‌రావు మృతి చెందిన తర్వాత వారి కుమారులు, నేడు వారి మనుమలు సొంత ఖర్చులతో పూజ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

తాతల కాలం నుంచి..

మా తాత ముత్తాల నుంచి శమీ పూజ నిర్వహిస్తున్నారు. వారు కాలం చెల్లిన తర్వాత మా తండ్రి చేశారు. మూడేళ్లుగా మా అన్నదమ్ములం కలిసి శమీ పూజ నిర్వహిస్తున్నాం. మా ఇంటి దగ్గర నుంచి డప్పు చప్పుళ్లతో గాంధీచౌక్ వెళ్లి, అక్కడి నుంచి గోవరమ్మ ఆలయం వరకు శోభాయాత్రగా వెళ్తాం. పండితుల దగ్గర నుంచి డప్పులు, పూజ సామగ్రి సొంత ఖర్చులతో చేస్తాం. ఇప్పటి వరకు ఆనవాయితీ తప్పలేదు.

\- విజిగిరి రాజేందర్, చెన్నూర్

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు



కోదండరామాలయం వద్ద చదును చేసిన స్థలం

భీమారం: మండల కేంద్రంలో నిర్వహించే దసరా వేడుకలకు కోదండరామాలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. శమీచెట్టు ప్రతిష్ఠించేందుకు ఆలయ ఆవరణలోని స్థలాన్ని ట్రాక్టర్ సాయంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బంది చదును చేయించారు. భీమారంలో ఏర్పాటు చేసే శమీ చెట్టు వద్దకి వచ్చి ప్రజలు పూజలు చేస్తారు.

ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏరియా జీఎం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి మైదానంలో గురువారం నిర్వహించే సప్త వ్యసనాల దిష్టిబొమ్మ దహనం (రాంలీలా) కార్యక్రమ ఏర్పాట్లను ఏరియా జీఎం రాధాకృష్ణతో కలిసి ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి వివేక్ వెంకటస్వామి, ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య వస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు, కార్మిక కుటుంబాలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

ఎన్నికలకు సహకరించాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రెండో సాధారణ పరిషత్, పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా జరిగేలా అధికారులు విధులు నిర్వర్తించాలని హాజీపూర్ మండల ఎన్నికల ప్రవర్తన నియమావళి నోడల్ అధికారి, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ లీడర్, తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ శాంతియుత ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై స్వరూప్‌రాజ్, కార్యదర్శులు, గ్రామ పాలనాధికారులు, పంచాయతీ, పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

వర్క్‌షాపులో ఆయుధపూజ



వర్క్‌షాపులో పూజలో పాల్గొన్న జీఎం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని వర్క్‌షాపులో దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఆయుధపూజతో పాటు వాహనాలకు పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా జీఎం రాధాకృష్ణ హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఉద్యోగులు రక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీవైజీఎం ధూప్‌సింగ్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, అధికారులు, ఏఐటీయూసీ నాయకులు, వర్క్‌షాపు ఉద్యోగులు ఉన్నారు.

లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో...

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఆయుధ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్, డాక్టర్ స్రవంతి రావు, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యూరియా బస్తాలు పంపిణీ



యూరియా బస్తాలు అందిస్తున్న అధికారులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలోని రైతువేదికలో బుధవారం వివిధ గ్రామాలకు 532యూరియా బస్తాలను కేటాయించగా అధికారులు పంపిణీ చేశారు. ఏవో యామిని ఆధ్వర్యంలో చెన్నూర్ పట్టణ సీఐ దేవేందర్‌రావు దగ్గరుండి యూరియాను ఆయా గ్రామాలకు పంపిణీ చేయించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది లక్ష్మణ్‌రెడ్డి, శ్రీనివాస్, ఏఈవో సాగర్ పాల్గొన్నారు.

పోలీసుల సూచనలు పాటించాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి తిలక్‌స్టేడియంలో గురువారం జరగనున్న రాంలీల కార్యక్రమాన్ని పురస్కరించుకొని పౌరులు, వాహనదారులు పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఆయన మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఏఎంసీ ఏరియా వైపు నుంచి తిలక్ స్టేడియంలో జరిగే రాంలీల కార్యక్రమానికి వచ్చే వాహనదారులు కాంటా చౌరస్తా వద్ద ఆటో స్టాండ్‌లో, కన్నాల ఫ్లైఓవర్ బ్రిడ్జి వైపు నుంచి ఫ్లైఓవర్ దగ్గర ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో పార్క్ చేయాలని తెలిపారు. మార్కెట్ మీదుగా బజారు ఏరియాలోకి ఎలాంటి వాహనాలను కూడా అనుమతించడం జరగదన్నారు. ఈ విషయాన్ని వాహనదారులు గమనించాలని తెలిపారు. జేబు దొంగలు, చైన్‌స్నాచర్లను దృష్టిలో పెట్టుకొని విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలను తస్కరించకుండా జాగ్రత్త వహించాలని, పిల్లలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్టీసీ బస్సులను కాల్‌టెక్స్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా కొత్తబస్టాండ్ వరకు వన్‌వే ద్వారా దారి మళ్లించనున్నట్లు తెలిపారు. రాంలీల కార్యక్రమానికి ప్రజలు భారీగా రానుండటంతో ప్రతి ఒక్కరూ కూడా పోలీసులకు సహకరించాలని, సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఉత్సవ రద్దీని దృష్టిలో పెట్టుకుని తిలక్ స్టేడియం నుంచి తిరిగి బయటకు వెళ్లడానికి మూడు గేట్లు ఏర్పాటు చేసినట్లు తొందరపడకుండా నిదానంగా బయటకు వెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణ కోసం 100మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ



మహా చండియాగం చేస్తున్న భక్తులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథ కాలక్షేప మండపంలో నిర్వహిస్తున్న సర్వజనినీ దుర్గాదేవిని బుధవారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు 2026కు సంబంధించిన అమ్మవారి క్యాలెండర్‌ను అందజేశారు. అంతకుముందు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జన్నారం: జన్నారం మండలం పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీలో అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు.

చెన్నూర్: చెన్నూర్ బట్టిగూడెం దుర్గాదేవి మండపం వద్ద పండితులు వేమారం సత్యమూర్తి శర్మ, గురుచరణ్ శర్మల ఆధ్వర్యంలో చండిహోమం నిర్వహించారు.

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాలలో శ్రీ ప్రసన్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో దుర్గామాత వద్ద మహా చండియాగం నిర్వహించారు.

కుండపోత వాన



రసూల్‌పల్లి వద్ద రోడ్డుపై వరద

జైపూర్: మండల కేంద్రంతో పాటు రసూల్‌పల్లి, ముదిగుంట, మిట్టపల్లి, ఇందారం, టేకుమట్ల, షెట్‌పల్లి, కుందారం, కిష్టాపూర్, వేలాల, పొనూర్, శివ్వారం గ్రామాల్లో బుధవారం సాయంత్రం కుండపోత వాన కురిసిది. రెండున్నర గంటపాటు ఏకదాటిగా కురవడంతో రోడ్లు జలమయం అయ్యాయి. మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారి రసూల్‌పల్లి వద్ద వరద నీరు రోడ్డుపై ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ఉన్నత ఉద్యోగాలు సాధించడం అభినందనీయం



ఉద్యోగాలు సాధించిన వారితో లయన్స్‌క్లబ్ సభ్యులు



అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

దండేపల్లి: కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించడం చాలా అభినందనీయం అని దండేపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొండు జనార్దన్ పేర్కొన్నారు. దండేపల్లి మండలం నుంచి ఇటీవల గ్రూప్–1 ఉద్యోగాలు సాధించిన వనజ, విష్ణువర్ధన్, గ్రూప్–2 ఉద్యోగాలు సాధించిన సంతోష్‌కుమార్, గోపిచంద్‌లతో పాటు, వారి తల్లిదండ్రులను మండలంలోని మేదరిపేటలో బుధవారం క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన రాజు, రామన్నలను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి గడ్డం రాంచందర్, కోశాధికారి రాజు, ఉపాధ్యక్షుడు రాజన్న, సభ్యులు మాదంశెట్టి మల్లికార్జున్, సుగుణాకర్, సత్యనారాయణ, కిషన్, శ్రీనివాస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: గ్రూపు 1 ఫలితాల్లో జన్నారం మండలం పొనకల్ గ్రామానికి చెందిన నగురు శ్రీహరిదాస్–భాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు నగురు అనిల్‌కుమార్ డీఎస్పీ ఉద్యోగానికి ఎంపిక కాగా మండల బీసీ సంఘం, సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో కన్వీనర్ కదార్ల నరసయ్య, జిల్లా కన్వీనర్ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ



దండేపల్లి: నెల్కివెంకటాపూర్‌లో...



కవ్వాల్‌లో బతుకమ్మ ఆడుతున్న ఎస్సై, మహిళలు

జన్నారం/దండేపల్లి: జన్నారం మండలవ్యాప్తంగా, దండేపల్లి మండలంలోని నెల్కివెంకటాపూర్, మేదరిపేట, లక్ష్మీకాంతపూర్, గుడిరేవు, అల్లీపూర్ తదితర గ్రామాల్లో బుధవారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చారు. బతుకమ్మలను గ్రామ కూడళ్ల వద్ద పెట్టి ఉయ్యాల పాటలు పాడుతూ, బతుకమ్మ ఆడారు. అనంతరం సమీప చెరువులు, వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



దండేపల్లి: లక్ష్మీకాంతాపూర్‌లో...



బతుకమ్మతో యువతి

గొల్లపల్లిలో దసరా వేడుకలు

నెన్నెల: మండలంలోని గొల్లపల్లిలో బుధవారం దసరా వేడుకలను నిర్వహించారు. అందరూ ఐక్యంగా కలిసి గ్రామ శివారులో జెండా ఎగురవేసి సంబ రాలు జరుపుకున్నారు. 2న గాంధీ జయంతి రావడంతో ముందస్తుగా విజయదశమి వేడుకలను జరుపుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మేకలు, కోళ్లను కోసుకొని విందు చేసుకున్నారు. దసరా రోజు నూతన వస్త్రాలు ధరించి డప్పుచప్పుళ్లతో జమ్మి చెట్టు వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు.